సాక్షి అనకాపల్లి

సోమవారం ॥ 8 ॥ జూలై ॥ 2024



సీతాఫలాలు వచ్చేశాయి

సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి, 12వమైలురాయి జంక్షన్ వద్ద అమ్మకాలు జరుగుతున్నాయి.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.3/26.0

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

ఫ్రీ కాదు.. డబ్బులకే..

జనం కంట్లో ఇసుక



నక్కపల్లి డిపో వద్ద ఇసుక నిల్వలు

- ఉచితంగా ఇస్తామంటూ ఊకదంపుడు ప్రచారం
- నిరాశ కలిగించిన నూతన పాలసీ
- ఇసుక టన్ను ధర రూ.1,225లు
- గత ప్రభుత్వంలో కంటే టన్ను దగ్గర రూ.25లు అధికం

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామంటూ ఊకదంపుడు ప్రచారం చేసిన చంద్రబాబు సర్కారు తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చింది. నూతన పాలసీ ప్రకారం వినియోగదారులకు ఉచితంగా సరఫరా చేయాల్సిన ఇసుకను డబ్బులకే విక్రయించేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. గత ప్రభుత్వం కంటే టన్ను ఒక్కంటికి రూ.25 లు అదనంగా ధర నిర్ణయించి విక్రయించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు గత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గోదావరి, కృష్ణా, వంశధార, తుంగభద్ర నదుల్లో లభించే ఇసుకను వినియోగదారులకు నామమాత్రపు ధరలకు ప్రభుత్వమే విక్రయించేలా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో ప్రత్యేకంగా డిపోలు ఏర్పాటు చేసింది. గోదావరి నది నుంచి నాణ్యమైన ఇసుకను ఇక్కడకు తరలించి ఎంపిక చేసిన ప్రైవేటు ఏజెన్సీల ద్వారా విక్రయాలు చేపట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభంలో డిపోల వద్ద విక్రయించే ఇసుక ధర టన్నుకు రూ.1,400లుగా నిర్ణయించింది. ఏడాది తర్వాత ధర రూ.1,200లకు తగ్గించింది. భూగర్భ గనుల శాఖ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో ముందుగా బుక్ చేసుకున్నవారికి మాత్రమే ఇసుక సరఫరా చేసేవారు. ఈ విధానం వల్ల ఇసుక పక్కదారి పట్టకుండా ఉండటంతోపాటు ప్రభుత్వానికి కూడా ఆదాయం లభించేది. ఇలా నాలుగేళ్లపాటు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేసింది. తాము అధికారంలోకి వస్తే నూతన ఇసుక పాలసీని అమల్లోకి తెస్తామని, ఉచితంగా సరఫరా చేస్తామంటూ టీడీపీ కూటమి ఎన్నికల ముందు వాగ్దానం చేసింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు జూలై 8 నుంచి నూతన ఇసుక పాలసీ అమలు చేస్తామని కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఉచితంగా ఇస్తున్నట్టు అధికార పక్షం ఊదరగొట్టింది. ఉచితంగా ఇవ్వకపోగా గత ప్రభుత్వం కంటే టన్ను దగ్గర రూ.25లు అదనంగా వసూలు చేయాలని నిర్ణయించడంతో జనం కంగుతినే పరిస్థితి వచ్చింది.

సర్వత్రా నిరసన

ఇసుక టన్ను రూ.1,225లకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా తమ ప్రభుత్వంలో ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామంటూనే టన్ను ధర రూ.1,225లుగా నిర్ణయించి విక్రయించేందుకు సన్నాహాలు చేయడం పట్ల పలువురు మండిపడుతున్నారు. ట్రాక్టర్ ఇసుక (5 టన్నులు) కావాలంటే ప్రభుత్వానికి రూ.6,125లులు చెల్లించాలి. దీనికి అదనంగా ట్రాక్టర్ అద్దెను దూరాన్ని బట్టి రవాణా చార్జీల కింద మరో రూ.1,200లు చెల్లించాలి. ఈ లెక్కన ట్రాక్టర్ ఇసుక ప్రస్తుత ప్రభుత్వ ధరల ప్రకారం రూ.7,325లు అవుతోంది. స్థానికులకయితే రవాణా చార్జీలు తగ్గే అవకాశం ఉంది. ఇసుక అవసరం ఉన్న వారు నేరుగా డిపో వద్దకు వెళ్లి ఆధార్ కార్డు చూపించి టన్నుకు రూ.1,225ల చొప్పున గూగుల్ పే, ఫోన్ పే లేదా ఏటీఎం కార్డును ఉపయోగించి చెల్లింపులు చేయాలి. అదే స్థానికంగా ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే గనుక తక్కువ ధరకు ఇసుక లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. రీచ్ వద్ద టన్నుకు సీనరేజ్ చార్జ్ రూ.88లు, లోడింగ్‌కు మరో రూ.20లు వెరసి టన్నుకు రూ.110 వరకు ఖర్చవుతుంది. రవాణా ఖర్చుల కింద మరో వెయ్యి రూపాయలు చెల్లించాలి. ఈ లెక్కన ట్రాక్టర్ ఇసుక రూ.2 వేల లోపే లభించే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. మొత్తం మీద డిపోల్లో ఉన్న ఇసుకను గత ప్రభుత్వం కంటే అధిక ధరకు విక్రయించడం పట్ల వినియోగదారులు మండిపడుతున్నారు.

రూ.625లకే టన్ను ఇసుక..

- గతంలో రాజమండ్రి నుంచి తెప్పించుకుంటే కారు చౌక



రాజమండ్రిలో ఇసుక కొనుగోలు చేసిన వారికి ఇచ్చిన బిల్లు (ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజమండ్రి నుంచి నేరుగా ఇసుకను తెప్పించుకునే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే రాజమండ్రి నుంచి కేవలం రూ.625లకు ఇసుక లభించేది. రవాణా ఖర్చులు ఎక్కువైనా పెద్ద మొత్తంలో ఇసుక అవసరమైన వారికి ఇది ఎంతో కలిసి వచ్చేది. రాజమండ్రి నుంచి 22 మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలు చేస్తే కేవలం రూ.13,750లు మాత్రమే చెల్లించాల్సి వచ్చేదని వినియోగదారులు చెబుతున్నారు. రవాణా చార్జీలు రూ.11 వేలతో కలిపి రూ.24,750 చెల్లిస్తే సరిపోయేది. డోర్ డెలివరీ చేసేవారు. ఈ ఏడాది మార్చి వరకు ఈ ధరలకే ఇసుకను సరఫరా చేశారు. ఇదే ఇసుకను ఇప్పుడు ఇసుక డిపోల వద్ద కొనాలంటే టన్ను రూ.1225ల చొప్పున రూ.26,950లు చెల్లించాల్సి వస్తుంది. దీనికి రవాణా ఖర్చులు అదనం.

ఇసుక టన్ను రూ.1225

- ఒక ఆధార్ కార్డుకు 20 టన్నులు మాత్రమే: కలెక్టర్

అనకాపల్లి: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక విధానంలో ప్రజలకు ఈ నెల 8 నుంచి ఇసుకను అందుబాటులోనికి తీసుకురానున్నట్లు కలెక్టర్ కె.విజయ కృష్ణన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల అవసరాల నిమిత్తం నక్కపల్లి, నర్సీపట్నంలలో ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నిల్వ కేంద్రాల ద్వారా ప్రజలకు వారి అవసరాల నిమిత్తం ఒక ఆధార్ కార్డుకు 20 టన్నుల ఇసుక మాత్రమే అందించనున్నట్లు తెలిపారు. ఇసుక కావాల్సిన వ్యక్తులు తమ ఆధార్ నకలు, ఇంటి నిర్మాణపు వివరాలను ఇసుక డిపో ఇన్‌చార్జ్‌కి అందించి, సంబంధిత రుసుము డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. టన్నుకు రూ.1225లు చెల్లించాలని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక డిపోలు పనిచేస్తాయన్నారు.

అంగరంగ వైభవం..

జగన్నాథుని రథోత్సవం



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెంలో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి వారి రథయాత్ర ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల జయజయ ధ్వానాల మధ్య జగన్నాథుని రథచక్రాలు ముందుకు కదిలాయి. స్వామి నామస్మరణతో వీధులు మార్మోగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజలు జరిపారు. జగన్నాథస్వామి ఆలయంలో స్వామి వారిని ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రథయాత్రను ప్రారంభించారు. గవరపాలెం నుంచి పురవీధుల గుండా రైల్వే స్టేషన్ రహదారి గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాలు వరకు రథయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఇంద్రద్యుమ్న హాలులో స్వామికి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవంలో స్వామివారి రథానికి ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 16న రథోత్సవంలో భాగంగా తిరుగు రథయాత్ర ఉంటుందని, అదే రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.



అలంకరణలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి

ఉత్సవంలో భాగంగా స్వామివారు 8న కూర్మావతారం, 9న వరాహావతారం, 10 నారసింహావతారం, 11న వామనావతారం, 12న పరశురామావతారం, 13న రామావతారం, 14న కృష్ణావతారం, 15న బుద్ధావతారం, 16న కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా దేవాలయాల అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆలయ ఈవో రాజసులోచన, డైరెక్టర్లు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..



వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జిల్లా నేతలు

- ఎవరూ అధైర్యపడొద్దు.. భవిష్యత్ మనదే..
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

కొమ్మాది (విశాఖ): వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అమానుషంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను ఎండగట్టడంతోపాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఎండాడలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా డా.బి.ఆర్.అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిక్షణం తెలుసుకుంటున్నారని తెలిపారు. నాయకులంతా కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో మళ్లీ మనం అధికారంలోకి వస్తామని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన రేగం మత్స్యలింగంను రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, పార్టీ అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్తలు మలసాల భరత్, అనురాధ, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.



ఉమ్మిడి అప్పారావుకు చెక్కు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

వైఎస్సార్ జయంతిని వాడవాడలా నిర్వహించండి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు.

కార్యకర్తకు బాసటగా..

టీడీపీ గుండాల దాడిలో గాయపడిన జీవీఎంసీ 9వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉమ్మిడి అప్పారావుకు పార్టీ బాసటగా నిలిచింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.50 వేల చెక్కును రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఉమ్మిడి దాసు, కార్పొరేటర్ స్వాతి దాస్ పాల్గొన్నారు.

గుమ్మిలో పడి బావ బావమరిది మృతి

- శోక సంద్రంలో తాటిపర్తి గిరి గ్రామం



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో యువకుల మృతదేహాలు

మాడుగుల: సరదాగా ఈతకెళ్లిన బావ బావమరిది గుమ్మిలో దిగి మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన మండలంలో తాటిపర్తి పంచాయతీ బిళ్లలపాలెం వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... తాటిపర్తి గ్రామానికి చెందిన కె.మోహన్‌చందు(26)కు నెల రోజుల క్రితం విశాఖ నగరానికి చెందిన యువతితో వివాహమైంది. ఈ నేపథ్యంలో అతడు విశాఖ నుంచి వచ్చిన తన బావమరిది జి.జ్ఞానేశ్వరరావు(22)తో కలిసి సాయంత్రం బిళ్లలపాలెం వద్ద తాచేరు గెడ్డలో సరదాగా ఈతకు వెళ్లారు. అక్కడ గుమ్మి లోతుగా ఉండడంతో ఈతకు వీలుకాలేదు. అందులో చిక్కుకుపోయి కేకలు వేశారు. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న వారిని స్థానికులు సహాయంతో మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు అక్కడ వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తామని ఎస్ఐ దామోదర నాయుడు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలిక హత్య కేసు..

ముమ్మర దర్యాప్తు

- ఘటనా స్థలంలో నిందితుడు రాసిన లేఖ లభ్యం

సాక్షి, అనకాపల్లి: రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో జరిగిన బాలిక హత్య కేసులో నిందితుడు జె.సురేశ్ కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోంది. సంఘటన స్థలాన్ని ఎస్పీ మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ విచారణ అధికారిగా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. బాలిక బద్ది దర్శిని (14) హత్య జరిగిన ప్రదేశంలో నిందితుడు రాసిన 13 పేజీల లేఖ దొరికింది. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఘటనా స్థలాన్ని ఐద్వా నాయకురాలు ప్రభావతి పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ముందుగా రాసి పెట్టుకున్న లేఖ : నిందితుడు సురేశ్ సంఘటన స్థలంలో వదిలి వెళ్లిన లేఖను ముందుగానే సిద్ధం చేసుకున్నట్టు అర్థమవుతోందని ఎస్పీ మురళీకృష్ణ సాక్షికి తెలిపారు. ఒక అర పేజీ మాత్రం హత్య చేశాక రాసినట్టు ఉందన్నారు. ఉంటే ఇద్దరం కలిసి ఉండాలని, లేదంటే చనిపోవాలని లేఖలో నిందితుడు పేర్కొన్నట్టు చెప్పారు. 'అందరూ క్షమించండి' అని లేఖ చివరిలో రాశాడని చెప్పారు. అయితే ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొనలేదని, అతని కోసం అన్ని కోణాల్లో గాలిస్తున్నామన్నారు.

సంప్రదాయం వైపే మొగ్గు 8లో

క్లుప్తంగా

ఆవుకు రెండు ఆడపెయ్యల జననం



చౌడువాడలో ఆవుకు జన్మించిన రెండు ఆడపెయ్యలు

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడలో శనివారం రాత్రి ఆవుకు కవలల ఆడపెయ్యలు జన్మించాయి. రెండో ఈతలో భాగంగా కవలల ఆడపెయ్యలకు జన్మనిచ్చినట్టు గ్రామానికి చెందిన రైతు పులిబంటి అప్పారావు తెలిపాడు. పుట్టిన రెండు ఆడపెయ్యలు ఆరోగ్యకరంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశాడు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్



మాట్లాడుతున్న ఐద్వా సభ్యులు

అచ్యుతాపురం: తొమ్మిదేళ్ల బాలికను అతి కిరాతకంగా చంపిన ప్రేమోన్మాదిని తక్షణమే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని ఐద్వా అచ్యు తాపురం మండల అధ్యక్షురాలు లక్ష్మి డిమాండ్ చేశారు. రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో దర్శిని అనే బాలికను నరికి చంపిన ప్రేమోన్మాదిపై చర్యలు తీసుకుని, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. దేవి, కాసులమ్మ, మౌనిక పాల్గొన్నారు.

డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్ల రెన్యూవల్‌కు అవకాశం



ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్: ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోకాంట్రాక్టు లెక్చరర్ల రెన్యూవల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. చంద్రశేఖర్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 2024 మార్చి 31వ తేదీ వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీలోగా తమ కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అర్హతలు, ఖాళీలు, పని గంటలు ఆధారంగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెన్యూవల్ చేస్తామన్నారు. ఇతర వివరాలకు సంబంధిత ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

సంప్రదాయం వైపే మొగ్గు

- రాగుల సాగులో మంచి ఫలితాలు
- రైతు స్థాయిలో విత్తనోత్పత్తి
- సొంతంగా సమకూర్చుకుంటున్న రైతులు
- ప్రభుత్వం 90 శాతం రాయితీపై సరఫరా చేసినా ఆసక్తి కరువు
- 141 క్వింటాళ్లలో 20 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు
- శుభ పరిణామమంటున్న వ్యవసాయశాఖ
- చైతన్యం నింపిన గత ప్రభుత్వం

జిల్లాలో రాగి పంటను సాగు చేసే రైతులు విత్తన సమస్యను అధిగమించారు. గణనీయమైన పురోగతి సాధించారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలపై ఆధారపడకుండా సాగు అవసరాలకు తగ్గట్టుగా వారే సమకూర్చుకుని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తున్నారు.సాటి రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.



నారు సేకరణలో గిరిజన మహిళలు



రాగుల నాట్లలో నిమగ్నమైన కూలీలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో ఆదివాసీ రైతులు పూర్వం నుంచి సాగు చేసే చిరుధాన్యాల పంటల్లో రాగులు ఒకటి. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఏటా సుమారు 16,373 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గత మూడేళ్ల క్రితం వరకు సాగుకు అవసరమైన విత్తనాలకోసం పూర్తిగా వ్యవసాయశాఖపై ఆధారపడేవారు. కొన్ని సందరాల్లో విత్తనాల కోసం ఇబ్బందులు పడిన పరిస్థితులు ఉన్నాయి. అలాంటి సమయంలో విత్తనోత్పత్తి ద్వారా సమస్య అధిగమించవచ్చని రైతులు గమనించారు. అందుకు తగ్గట్టుగా వారిలో చైతన్యం నింపేందుకు గత ప్రభుత్వం నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు దోహదపడ్డాయి. ఇప్పుడు వ్యవసాయశాఖపై ఆధారపడకుండా వారే సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా చేసుకుని నారుమడులు తయారు చేసుకున్నారు. గతంలో ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతానికి అనువైన చైతన్య, వేగవతి, సింహాద్రి రకాల విత్తనాలను సరఫరా చేసింది. మంచి దిగుబడులు రావడంతో అప్పటినుంచి ఈ రకాలను మాత్రమే సాగు చేస్తున్నారు. ఏటా దిగుబడి సమయంలో కొంతమేర విత్తనాల కోసం కేటాయిస్తున్నారు. ఇలా సొంతంగా విత్తనం సమకూర్చుకోవడం వల్ల ప్రభుత్వం పంపిణీ చేసే విత్తనాల కోసం ఎదురుచూపులు తప్పాయి. ఈ ఏడాది కూడా వారు భద్రపరచుకున్న చైతన్య, వేగవతి, సింహాద్రి రకాలతో నారుమడులు తయారు చేసుకున్నారు. ఈ రకాలు 110 రోజుల్లో దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

రాయితీ విత్తనాలపై ఆసక్తి కరువు

జిల్లాలో రాగుల సాగు విస్తీర్ణానికి తగ్గట్టుగా గత ప్రభుత్వం ప్రస్తుత సీజన్‌కు సంబంధించి వేగవతి, శ్రీచైతన్య రకాలకు చెందిన 141 క్వింటాళ్ల విత్తనాలను ముందుగానే సిద్ధం చేసింది. అయితే రైతులు వీటిపై ఆసక్తి చూపలేదు. ఇప్పటివరకు కేవలం 20 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకువెళ్లారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మిగతా రైతులంతా భద్రపరచుకున్న విత్తనాలను వినియోగించుకున్నారు. గత ప్రభుత్వం రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వడంతోపాటు పంట దిగుబడి వచ్చిన తరువాత గిట్టుబాటు ధరకు 181 టన్నుల రాగులను కొనుగోలు చేసింది. కిలోకు రూ.38.40 చొప్పున ధర చెల్లించింది. వారి ఖాతాల్లో వెంటనే నగదు జమ చేసింది. దీని వల్ల మార్కెటింగ్ సమస్య పరిష్కారమైంది.

గుళి రాగి సాగు విధానంపై మొగ్గు

గుళి రాగి సాగు విధానంపై ఇప్పుడిప్పుడే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ విధానంలో సాగు చేయడం వల్ల పిలకశాతం పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగా వెన్నుల సంఖ్య పెరిగి గణనీయంగా దిగుబడి వస్తుంది. ఎకరా విస్తీర్ణంలో సాగుకు అర కిలో విత్తనం సరిపోతోంది. అదే పాత విధానంలో సాగు చేసేందుకు ఎనిమిది కిలోల విత్తనం అవసరం. దీనివల్ల రైతు స్థాయిలో పెట్టుబడి వ్యయం పెరుగుతుంది.

రసాయన ఎరువులకు దూరం

సాధారణంగా ఏజెన్సీలో రైతులు రసాయన ఎరువులు, క్రిమి సంహార మందుల వినియోగానికి దూరంగా ఉంటారు. ప్రకృతి సాగు విధానాన్ని అలవర్చుకున్న వీరు ఆవుపేడ, మూత్రంతోనే ఎరువులు, కషాయం తయారు చేసి వినియోగిస్తున్నారు.దీనివల్ల సాగుకు పెట్టుబడి వ్యయం తగ్గింది. ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్లో కూడా గిట్టుబాటు ధర లభిస్తోంది. పిలకలు ఎక్కువగా రావడంతో దిగుబడి కూడా గణనీయంగా పెరిగిందని గిరి రైతులు తెలిపారు. ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వారు చెబుతున్నారు. ఏజెన్సీలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున రైతులు నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.

నాణ్యతలో నంబర్‌వన్



గిరిజనులు సాగుచేస్తున్న రాగుల పంట నాణ్యతలో నంబరు వన్‌గా గుర్తింపు పొందింది. ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఆర్‌బీకేల్లో 90 శాతం రాయితీపై విత్తనాలను సిద్ధంగా ఉంచాం. అయితే రైతులు వారు సొంతంగా సిద్ధం చేసుకున్న విత్తనాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల 141 క్వింటాళ్లలో 20 క్వింటాళ్లు మాత్రమే అమ్ముడయ్యాయి. రైతులు సొంతంగా మేలుజాతి విత్తనాలను సమకూర్చుకుని సాగు చేయడం మంచి పరిణామం.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

మహానేత జ్ఞాపకాలు పదిలం

- నాడు వైఎస్సార్ నాటిన మొక్క నేడు వృక్షమై..
- అపురూపంగా చూసుకుంటున్న పాడేరు వాసులు



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం తన రెండు కళ్లుగా భావించి పాలన అందించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాపకాలు ఇప్పటికీ మన్యంలో పదిలంగానే ఉన్నాయి. జిల్లా కేంద్రమైన పాడేరు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 2009 జూలై 12న ఆయన నాటిన కదంబం మొక్క నేడు వృక్షంగా ఎదుగుతోంది. ముఖ్యమంత్రి హోదాలో పాడేరు విచ్చేసిన ఆయన గిరిజనులతో నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. అటవీభూములకు పట్టాల పంపిణీ అనంతరం ఈ మొక్కను నాటారు. ఆయన జ్ఞాపకంగా ఈ చెట్టును అటవీశాఖ, పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు సంరక్షిస్తున్నారు. నాటి జ్ఞాపకాన్ని పాడేరు వాసులు నేడు అపురూపంగా చూసుకుంటున్నారు. – సాక్షి, పాడేరు

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య



వివాహిత మృతదేహం

పాయకరావుపేట: మండలంలోని మంగవరం గ్రామంలో భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల ప్రకారం... ఎస్.రాయవరం మండలం పెట్టుగొల్లపల్లికి చెందిన దార్ల అర్జమ్మ కుమార్తె వెంకటకుమారికి మంగవరం గ్రామానికి చెందిన బడి నాగేశ్వరరావుతో 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం ఉన్నారు. వివాహ సమయంలో రూ.60 వేలు, రూ.లక్ష విలువైన సారె, నాలుగు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని భర్త తరచుగా వేధిస్తున్నాడు. ఇదే విషయమై మూడు నెలల క్రితం ఆమెను పుట్టింటికి పంపించాడు. 15 రోజుల క్రితం తన భార్యను మరలా కాపురానికి పంపాలని భర్త కోరగా, రూ.2 వేల కిరణా సామగ్రి ఇచ్చి పంపించారు. ఈ నెల 6వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో మృతురాలు వెంకట కుమారి కుమారుడు తన అమ్మమ్మ ఇంటికి ఫోన్ చేసి అమ్మకు ఫిట్స్ వచ్చిందని, సీరియస్‌గా ఉందని చెప్పాడు. వెంటనే మంగవరం రాగా ఇంటి బయట మడత మంచంపై కుమార్తె శవం చూసి మృతురాలి తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతిపై తన అల్లుడిని అడుగ్గా ఉరేసుకుని చనిపోయినట్లు సమాధానమిచ్చాడని వాపోయారు. మృతురాలి తల్లి అర్జమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

మోటూరుపాలెంలో అదుపులో డయేరియా

- డీఎంహెచ్‌వో బాలాజీ



ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం: మండలంలోని మోటూరుపాలెంలో కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదని జిల్లా వైద్య శాఖాధికారి ఎం.బాలాజీ పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో డయేరియా కేసులు నమోదయిన నేపథ్యంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇక్కడ వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వివరాలు తెలుసుకుని నివేదించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉందన్నారు. మరుగుదొడ్లు కావాల్సిన వారు పూర్తి వివరాలను పంచాయతీ కార్యదర్శికి అందజేయా లని సూచించారు. ఆయన వెంట డాక్టర్ శ్రావ్య, వెంకటేష్, సీహెచ్‌వో వేణుగోపాల్ ఉన్నారు.

అనకాపల్లి నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి పిల్లాపాపలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వృద్ధులు, గర్భిణుల కోసం అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో వెంకటేశ్వరరావు

అనకాపల్లి: ఈ నెల 19న నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు వివిధ కేటగిరీల్లో క్రీడాకారులను ఎంపిక చేశామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక గాంధీనగరం సాయిశక్తి టెక్నోస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం ఆడడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి చదరంగంపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. అండర్ -19 విభాగంలో విన్నర్‌గా ఎస్.రాయవరానికి చెందిన శ్రావ్యశ్రీ, రన్నరప్‌గా అచ్యుతాపురానికి చెందిన మిద్దె ధనుష్, మూడు, నాలుగు స్థానాల్లో అనకాపల్లికి చెందిన గంధవరపు కార్తీక్, ఎం.గోపాలకృష్ణ , బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో కందుల జయలక్ష్మి, ద్వితీయ స్థానంలో జి.వైష్ణవి, తృతీయ స్థానంలో బి. సహస్ర, నాలుగో స్థానంలో గీతాంజలి నిలిచారు. వీరితోపాటు అండర్ -17 విభాగంలో కె.మోహిత్, రిషిత్, బి.హితిక, ప్రియాన్షి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్కూల్ కరస్పాండెంట్ శ్రీదివ్య రూ.5 వేలు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సీనియర్ చెస్ కోచ్ రామకృష్ణ, మల్లికార్జున, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



ఎంపికైన ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు

చోడవరం: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్టు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి ఆదివారం తెలిపారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు జి.వి. శశివర్ధన్, జి. కారుణ్యసందీప్, పడాల తరుణ్ పతకాలు సాధించారని మురళీ చెప్పారు. వీరు ముగ్గురు వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకూ విశాఖలో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన ముగ్గురు క్రీడాకారులను చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

సరుగుడు జలపాతంలో సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే జలపాతంలో జలకాలాటాడేందుకు పోటీ పడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం వద్ద నీటి ప్రవాహం పెరిగింది. దాంతో అనకాపల్లి, కాకినాడ జిల్లాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో కాలక్షేపం చేశారు. అదే విధంగా తాండవ రిజర్వాయరుపైన సందర్శకులు సందడి చేశారు. ఇంతవరకు ఇక్కడ నీటి మట్టం అడుగంటడంతో సందర్శకులు కానరాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగింది. దాంతో సందర్శకులు రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రతిభకు పట్టాభిషేకం

టెన్త్‌లో రాణించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సత్కారాలు



సమావేశంలో మట్లాడుతున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి: టీచర్ అనే పదంలో తెలియని శక్తి ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గవరపాలెం సత్యాస్ లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం అనే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతీ ఏడాది ప్రతిభా పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమన్నారు. డీఈవో ఎం .వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో 89 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని, వచ్చే ఏడాది నూరు శాతానికి కృషి చేస్తామన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలు పురస్కార గ్రహీతలను అభినందించారు. అనంతరం జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో అన్ని మండలాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ కనబర్చిన 80మంది విద్యార్థులతో పాటు 37 మంది ఉపాధ్యాయులను పురస్కారాలు అందించి హోం మంత్రి అనిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, డిప్యూటీ డీఈవో అప్పారావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, ప్రధన కార్యదర్శి సీహెచ్. పెద్దినాయుడు, కార్యదర్శి కొణతాల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక పంపిణీ

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



మైనింగ్, సచివాలయ, రెవెన్యూ అధికారులతో సమావేశమైన ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఉచిత ఇసుక పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. జిల్లా మైనింగ్ అధికారి సుబ్బారాయుడితో కలిసి ఆదివారం తన కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్న మండలం గబ్బాడ యార్డులో 48,204 టన్నులు, నక్కపల్లి యార్డులో 28,915 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నందున సోమవారం నుంచి అవసరమైన వారందరికీ ఇసుక సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం టన్నుకు రూ.1,225 చొప్పున నిర్దేశించిందన్నారు. ఇంతకు మించి ఒక్క రూపాయ వసూలు చేసినా యార్డుల నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ కార్డుకు 20 టన్నులు ఇసుక ఇవ్వాలని సూచించారు. సంబంధిత వ్యక్తి వివరాలు, వెహికల్ నెంబరు, ఎక్కడకు తీసుకువెళ్తున్నది పక్కా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఇసుక అవసరమైన వ్యక్తులు నేరుగా యార్డుకు వెళ్ళి ప్రభుత్వం నిర్దేశించిన నగదు చెల్లించి ఇసుక తీసుకువెళ్లవచ్చన్నారు. అనధికారికంగా ఎవరికైనా ఇసుక సరఫరా చేస్తే విధి నిర్వహణలో ఉన్న వ్యక్తులపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. యార్డు నుంచి ఇసుక తీసుకువెళ్లే వ్యక్తే రవాణా చార్జీలు భరించుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో డివిజనల్ మైనింగ్ ఏడీ రవికాంత వర్మ తదితరులు పాల్గొన్నారు.

10న అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి: ఈ నెల 10న డిమాండ్స్ డే సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలపై జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంతోపాటు మండల కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగుల సమ్మెకాలంలో ఇచ్చిన హామీల జీవోలు తక్షణమే అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కోత పెడుతుందన్నారు. ఈ నిధులను పెంచాలని, ఐదేళ్లలోపు బాల బాలికలను ప్రైవేట్ స్కూల్లో చేర్చకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా జీవోలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, కోశాధికారి వి.వి.రమణమ్మ, నాయకులు కె.తనూజ, జయలక్ష్మి, రమణి, సత్యవేణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

14న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి: స్థానిక గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మండలంలోని బట్లపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భావితరాల మనుగడను, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మానవ జాతి మనుగడకు మొక్కలే ప్రధాన ఆధారమన్నారు. చెట్లను ఇష్టారీతిన నరికేయడం వల్ల వాతావరణంలో మార్పులు జరిగి, విపత్తులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

'నూతన చట్టాలపై అవగాహన పెంచాలి'

అనకాపల్లి: భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియం చట్టాలు పూర్తి స్థాయిలో అమలుపరిచే ముందు ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. పోలీస్ వ్యవస్థలో కింది స్థాయి అధికారుల నుంచి ఉన్నత స్థాయి అధికారులతో పాటు, విద్యాలయాల్లో, వివిధ ప్రజా సంఘాల కార్యక్రమాల్లో నూతన చట్టాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్లే యువత నేరాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే కొత్తగా వచ్చిన మూడు చట్టాలపై కనీస అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల పాఠ్యాంశాల్లో కూడా చట్టాల్లోని ప్రాథమిక సమాచారాన్ని పొందుపరిచేలా కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


గణపర్తిలో పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాయుడు

మునగపాక: గణపర్తి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు పేర్కొన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామంలోని డ్రైనేజీ, కాలువల్లో పేరుకుపోయిన షిల్టు తొలగింపు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డయేరియా సోకకుండా సీజన్‌లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 48 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 226 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

బాల సదనం.. సౌకర్యాల నిలయం

- పూర్తి స్థాయిలో మౌలిక వసతుల ఏర్పాటు
- పూర్వ కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చొరవ మరువలేనిది

కశింకోటలోని బాలసదనం. తల్లిదండ్రుల్లేని, ఇద్దరిలో ఏ ఒక్కరినో కోల్పోయిన బాలికల ఆవాసం. ఆదరించే వారు లేక, చదువుకు దూరమైన పిల్లల్ని ఇక్కడ చేర్పిస్తారు. వారు ఇక్కడే ఉంటూ సమీపంలోని స్కూళ్లలో చదువుకుంటారు. అరకొర వసతులతో ఉండే ఈ బాల సదనాన్ని గత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చొరవ తీసుకుని, మౌలిక వసతుల మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆ పనులు పూర్తి చేసుకున్న బాలికల సదనం సౌకర్యాల నిలయంగా మారింది.


బాలసదనం లోపల గదులకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పాత్ వేలు

కశింకోట: స్థానిక బాల సదనంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి, అభివృద్ధి చేశారు. జిల్లాలోని పూర్తి, పాక్షిక అనాథ బాలికలు, బడికి దూరంగా ఉన్న బాలికలు 50 మంది ఇక్కడే ఉంటున్నారు. వీరు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆరో తరగతికి చేరుకున్నాక వారిని కేజీబీవీలో చేర్పిస్తారు.

రూ.కోటితో అదనపు గదులు

ఈ బాల సదనం ఆరంభంలో శిథిల భవనంలో ఉండేది. ఆర్నేళ్ల క్రితం సుమారు రూ.కోటితో పడక గదులు, రీడింగ్ రూమ్‌లు, స్నానాల గదులు తదితర నిర్మాణాలు చేపట్టారు. ఈ నిధులతో కొత్త భవనం అందులో గదులు మాత్రమే నిర్మించగలిగారు. మిగిలిన సదుపాయాలకు నిధులు సరిపోక, అరకొర సౌకర్యాల నడుమే పిల్లలు నివసించాల్సి వచ్చేది. ఈ విషయాన్ని సదనం సందర్శనకు వచ్చిన అప్పటి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి గుర్తించారు. వెంటనే మిగుల సౌకర్యాల ఏర్పాటుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. దాంతో పాటు తన సొంత డబ్బుతో బాలికలు తమ దుస్తులు ఉతుక్కునేందుకు వీలుగా వాషింగ్ మెషిన్‌ను సమకూర్చారు.

పూర్తయిన నిర్మాణాలు

గత కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో పాటు, కలెక్టర్ చొరవతో స్థానిక పరిశ్రమలు కూడా స్పందించి, తమకు వీలున్న మేరకు నిధులిచ్చాయి. వీటితో సదనంలోని ప్రాంగణాన్ని చదును చేసి, గదులకు రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా పాత్ వేలు ఏర్పాటు చేశారు. చుట్టూ గార్డెనింగ్‌కు కాంక్రీట్‌తో నిర్మాణాలు చేపట్టారు. సదనం ఆవరణలో ఉన్న మర్రి చెట్టు ప్రాంతంలో కూర్చుని సేద తీరేందుకు, పిల్లలు చదువుకునేందుకు వీలుగా సిమెంట్ దిమ్మెలు నిర్మించారు. ముందు వైపు అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పూర్తి చేశారు. వంట గదిలో ప్లాట్ ఫాం నిర్మించి, అదనపు సదుపాయాలు మెరుగుపర్చారు. ప్రవేశ ద్వారంలో గేటు, బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో బాలికలతోపాటు, వారిని అప్పుడప్పుడూ చూసేందుకు వచ్చే బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత కలెక్టర్ చొరవతో..

బాల సదనంలో వసతుల ఏర్పాటుకు గత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కృషి ఎంతగానో ఉంది. ఆయన మంజూరు చేసిన నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి చేశాం. పాత్ వేలు, కిచెన్ అభివృద్ధితోపాటు అసంపూర్తిగా మిగిలిన ప్రహరీని కూడా పూర్తి చేశాం. ప్రధాన మార్గంలో పటిష్ట గేటు ఏర్పాటు చేసి, బోర్డు అమర్చాం. ఇప్పుడు వసతులతోపాటు, అక్కడి పిల్లల రక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

– సాయికృష్ణ, మండల ఇంజినీర్, పంచాయతీరాజ్ శాఖ, కశింకోట


కశింకోటలోని బాల సదనం



కొత్తగా ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారం గేటు, బోర్డు


వంట గది

వైద్య శిబిరానికి విశేష స్పందన

40 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న యువత

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన దివంగత మాసవరపు సన్నిబాబు జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. వైద్య శిబిరాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సందర్శించి నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. శిబిరంలో కంటి పరీక్షలు, క్యాన్సర్, గర్భిణులు, స్త్రీలు, షుగర్, బీపీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండెకు సంబంధించిన సమస్యలపై ప్రముఖ వైద్య నిపుణుల బృందం శ్రీదేవి, భానుకిరణ్, స్వర్ణ, రమేష్, చతుర్వేది, పూజిత, సహస్ర, యుగంధర్, మంజూ, కృష్ణ ప్రసాద్, గుండా సుదీర్, దివ్య పరీక్షించారు. 845 మంది రోగులకు వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, నాయకులు సన్నిదేముడు, సన్యాసప్పారావు, ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ, మాసవరపు సురేష్, చెల్లయ్యమ్మ, లక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన రేషన్ లారీ

తప్పిన పెను ప్రమాదం


అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలో సూరెడ్డిపాలెం బ్రిడ్జి డివైడర్ పైకెక్కిన రేషన్ లారీ

సబ్బవరం: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై మండలంలోని సూరెడ్డిపాలెం జంక్షన్ వద్ద ఆదివారం లారీ అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌పైకి దూసుకు పోయింది.అదృష్టవశాత్తు లారీ డివైడర్‌పై చిక్కుకుపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. వివరాలు.. పశ్చిమ బెంగాల్ నుంచి శనివారం బియ్యం లోడుతో కేరళకు లారీ బయలుదేరి వెళ్తుంది.ఆదివారం తెల్లవారుజామున సూరెడ్డిపాలెం వచ్చే సరికి గుజరాత్‌కు చెందిన డ్రైవర్ ఉజ్జల్ పగ్రే నిద్ర మత్తులోకి జారుకోవడంతో బ్రిడ్జి డివైడర్ పైకి లారీ దూసుకుపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని మొబైల్ హైవే పోలీస్‌లు తెలిపారు.బ్రిడ్జి డివైడర్ నుంచి లారీ కిందపడితే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్‌తో పాటు క్లీనర్ హనిమస్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లాత్ బ్యాగులు వినియోగిద్దాం


కరపత్రాలు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, చిన్నారులు

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించాలని స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఏవీఎన్ మూర్తి కోరారు. మండలంలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదవడం అంటే నాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పిల్లలకు క్లాత్ బ్యాగుల వినియోగంపై అవగాహన కల్పించారు. ముందుగా సంధిందిత కరపత్రాలను ప్రదర్శించారు. వాటిని తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారికి అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదన్నారు. అనంతరం భగవద్గీత శ్లోకాలపై భీశెట్టి లక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను, నిర్వాహకులు యల్లపు సంజీవరావు, నాగలక్ష్మి, ఆడారి సునీత, భీశెట్టి తులసి, మణి, చదరం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

యలమంచిలి రూరల్: రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో 9వ తరగతి విద్యార్థిని బద్ది దర్శినిని అతి కిరాతకంగా హతమార్చిన ప్రేమోన్మాది సురేష్‌ను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా సహాయ కార్యదర్శి మైలపల్లి బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనతో రాష్ట్రంలోని విద్యార్థులంతా ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాలికలు చదువుకునేందుకు స్కూళ్లకు వెళ్లాలంటేనే భయపడేలా ఈ హత్య జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలు దర్శిని కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి బాలాజీ విజ్ఞప్తి చేశారు.

పాల సొసైటీ అధ్యక్షుడిగా రమణబాబు


రమణబాబును సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం: అమృతపురం పాలసొసైటీ నూతన అధ్యక్షుడిగా గండి రమణబాబు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడితో పాటు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను గ్రామ పెద్దలతో పాటు పాల ఉత్పత్తిదారులు ఘనంగా సత్కరించారు. రమణబాబు మాట్లాడుతూ పాలసొసైటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాలకవర్గాన్ని సత్కరించిన వారిలో మాజీ సర్పంచ్ గండి ముత్యాలనాయుడుతో పలువురు గ్రామ పెద్దలు ఉన్నారు.

11న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 11న సబ్బవరంలో నిర్వహిస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సబ్బవరం,అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు.సబ్బవరం సబ్ స్టేషన్ వద్ద 11వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వినియోగదారులు తమ సమస్యలపై అర్జీలు, ఫిర్యాదులు, అందజేయవచ్చునని సూచించారు.

కొత్తూరులో భారీగా కోడి పందాలు

రాంబిల్లి: కొత్తూరులో ఆదివారం భారీ స్థాయిలో కోడి పందాలు జరిగాయి. గ్రామదేవత పండగ సందర్భంగా ఇక్కడ కోడి పందాలు నిర్వహించారు. ఇవి జరిగిన ప్రాంతంలో పేకాట, గుళ్లాటలు జరిగాయి. రూ.వేలల్లో ఫణంగా పెట్టి పందెంలో స్థానిక యువత పాల్గొన్నారు. దీనిపై సీఐ నర్సింగరావును వివరణ కోరగా.. పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని సాయినగర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఇందుగుబిల్లి గోపి అధ్యక్షతన మండల అధ్యక్షుడు బొర్రా జయరాజ్ మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకు మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా మాదిగ పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గొటివాడ సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కొద్దిపాటి యువకులతో స్థాపించిన ఎమ్మార్పీఎస్ ఈ రోజు ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు జాతీయ స్థాయిలో ఉద్యమించే సంస్థగా కొనసాగుతోందన్నారు. జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలరావు, నాయకులు దువ్వి దుర్గాలు, సన్యాసి, ఇందుగుబిల్లి పరదేశి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఊరూవాడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

అనకాపల్లి/కశింకోట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు కశింకోట మండలం ఏఎస్ పేటలో, 8.30కు తాళ్లపాలెం, 9 గంటలకు కశింకోట, 9.30కు అనకాపల్లి పట్టణంలోని రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం, 9.45కు జాతీయ రహదారిలోని పూడిమడక జంక్షన్ వైఎస్సార్ విగ్రహం వద్ద, 10 గంటలకు నెహ్రూచౌక్, 10.15కు గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద, 10.30కు మండలంలోని కూండ్రం గ్రామంలో మహానేత జయంతి సందర్భంగా నివాళులర్పించి, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఘనంగా జగన్నాథుని రథోత్సవం


కశింకోటలో రథంపై ఊరేగుతున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు


స్వామివార్లను దర్శించుకుంటున్న ప్రజలు

కశింకోట: స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుభద్ర, బలభద్రుడు, జగన్నాథస్వామి వార్ల విగ్రహాలను రథంపై నిలిపి ఆలయం నుంచి డప్పులు, వాయిద్యాలతో రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రథం ముందు రెండు వైపులా నిలిచి రథానికి కట్టిన తాడును జయజయ ధ్వానాల మధ్య భక్తి పారవశ్యంతో ముందుకు లాగారు. అక్కడి నుంచి కోమటి వీధి, పెదబజారు, కస్పావీధి, ద్వారపురెడ్డి వీధి, ఉప్పునీటి దిబ్బ, అమరపల్లి వీధి, పోస్టాఫీసు వీధి, పూసర్ల వీధి, జాతీయ రహదారి, సంతబయలు, గవరపేట, వడ్డి వీధుల మీదుగా తిరిగి ఆలయం వరకు రథోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామి వార్లను దర్శించుకుని, పూజలు జరిపారు. తొలుత ఆలయంలో విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, కన్నబాబు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణోత్సవం


రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనకాపల్లి: గవరపాలెం జగన్నాథస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవార్లకు దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వరాహ శివ సూర్యనారాయణ(బుజ్జి) పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని, విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ డైరెక్టర్లు, ఆలయ ఈవో, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి తరలింపు


కొత్తపోలవరం కొండపై గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: వీకెండ్ వస్తే చాలు అక్రమ రవాణాదారులు పెట్రేగి పోతున్నారు. ప్రభుత్వం మారి అధికారుల బదిలీల క్రమంలో గ్రావెల్, ఇసుక, మట్టిని జేసీబీలు ఉపయోగించి యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. గుడివాడ శివారు కొత్తపోలవరం వద్ద ఆదివారం జేసీబీ ఉపయోగించి గ్రావెల్ తవ్వుకుని తరలించారు. అదే క్రమంలో జేవీపాలెం, పేటసూదిపురం, సర్వసిద్ధి గ్రామాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయం తెలిసిందే. సోమిదేవపల్లి, దార్లపూడి పరిసర ప్రాంతాల్లో వరహా నది గట్ల వద్ద వీలు కుదిరినప్పుడల్లా ఇసుక తరలించుపోతున్నారు. శని, ఆదివారాలు ఈ దందా మరింత జోరుగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించటం లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ మేరకు కొత్తపోలవరం గ్రావెల్ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలిపారు.

నేత్రపర్వంగా జగన్నాథుని రథయాత్ర


మునగపాకలో జగన్నాథ స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాకలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర గ్రామంలోని వీధుల వీదుగా నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి భక్తులు జగన్నాథుడిని దర్శించుకున్నారు. జై గంటలు కొడుతూ తోడపెద్దు సేవలతో ఊరేగించారు. శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విల్లూరి జగన్నాథరావు, కాండ్రేగుల జగ్గప్పారావు, కాళ్ల జగ్గారావు, వెలగా వెంకటప్పారావు, బొడ్డేడ ఈశ్వరరావు, ఆడారి జగ్గారావు, బొడ్డేడ జగ్గారావు, ఆడారి బాపునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.